

89 కేసుల్లో 80 మంది అరెస్టు

ఆగస్టు నెలలో నగర పరిధిలో జరిగిన 89 చోరీ కేసుల్లో 80 మంది నిందితులను అరెస్టు చేసినట్లు సీపీ చెప్పారు. 8లో



ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి

జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 8లో



శ్రీ వీర గణపతిగా సంపత్ వినాయగర్

న్యూస్‌రీల్

ఏడుగురు సీఐలకు స్థానచలనం



విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషరేట్ పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఇందులో ఇద్దరిని విశాఖ రేంజ్‌కు సరెండర్‌గా చేయగా.. ఐదుగురికి పోస్టింగ్ కల్పించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రతబాగ్చి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆనందపురం లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న టి.వి.తిరుపతిరావును, గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న ఎం.శ్రీనివాసరావును విశాఖ రేంజ్ వీఆర్‌కు సరెండర్ చేశారు. అలాగే త్రీటౌన్ లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న ఎ.పార్థసారధిని గాజువాక లా అండ్ ఆర్డర్, అనకాపల్లి జిల్లాలో వీఆర్‌లో ఉన్న పల్లా రమణయ్యను త్రీటౌన్ లా అండ్ ఆర్డర్, అల్లూరి జిల్లా నుంచి వచ్చిన చింతా వాసునాయుడును ఆనందపురం లా అండ్ ఆర్డర్ సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. సీఎస్‌బీ(పొలిటికల్)లో ఉన్న వాసపల్లి రామారావుకు కంచరపాలెం లా అండ్ ఆర్డర్, సిటీ వీఆర్‌లో ఉన్న వాసంశెట్టి శ్రీనివాసరావుకు ఆరిలోవ లా అండ్ ఆర్డర్ పోస్టింగ్ ఇచ్చారు.

13 నుంచి సింహగిరిపై పవిత్రోత్సవాలు



పవిత్రాలతో దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, వైదికులు, ఉద్యోగులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 17 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఏడాదంతా స్వామివారికి జరిగే నిత్యపూజలు, వార్షిక ఉత్సవాల్లో వైదిక పరంగా ఎలాంటి దోషాలు ఉన్నా వాటిని నివృత్తి చేసుకునేందుకు పవిత్రోత్సవాలు ఏటా నిర్వహించడం ఆనవాయితీ. పవిత్రోత్సవాల సందర్భంగా ఈనెల 13 నుంచి 17వరకు రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయని ఈవో తెలిపారు. అలాగే అన్ని ఆర్జిత సేవలు, నిత్యకల్యాణం రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా పవిత్రోత్సవాలను పురస్కరించుకుని పలు రకాల పవిత్రాలను ఇప్పటికే దేవస్థానం అధికారులు, వైదికులు కొనుగోలు చేశారు. వాటిని మంగళవారం సిద్ధం చేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవోలు, అర్చకులు పాల్గొన్నారు.

బీహెచ్ సిరీస్ వాహనదారులు పన్ను చెల్లించాలి

గోపాలపట్నం: నగరంలో బీహెచ్ సిరీస్ రిజిస్ట్రేషన్ నంబర్లతో తిరుగుతున్న వాహనదారులు వెంటనే పన్ను చెల్లించాలని ఉపరవాణా కమిషనర్ రాజారత్నం కోరారు. ఉపాధి/ఉద్యోగం కోసం ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి వెళ్లే వారి నమోదును సులభతరం చేయడానికి ఈ సిరీస్ ప్రారంభించింది. ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్నారో ఆ రాష్ట్రానికి పన్ను చెల్లించాలి. అక్కడే వినియోగించాలి. ఇతర రాష్ట్రాల్లో ఆ వాహనం వినియోగిస్తే పన్ను తప్పనిసరిగా చెల్లించాల్సి ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్నవారు.. నాలుగు రాష్ట్రాల్లో కంటే ఎక్కువ రాష్ట్రాల్లో బ్రాంచ్‌లున్న ప్రయివేటు సంస్థల్లో పని చేసేవారికి మాత్రమే బీహెచ్ రిజిస్ట్రేషన్ వర్తిస్తుందని తెలిపారు. అయితే వాహనాన్ని వినియోగిస్తున్న రాష్ట్రంలో పన్ను చెల్లించకుండా నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాయంత్రం ఓపీకి మంగళం



కేజీహెచ్‌లో సాయంత్రం ఓపీలో భాగంగా రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులు (ఫైల్)

- కేజీహెచ్‌లో రోగులకు **తప్పని అవస్థలు**
- గతంలో ఉదయంతో **పాటు** సాయంత్రం ఓపీ సేవలు
- సాయంత్రం ఓపీ ద్వారా **రోజుకు** 200 మందికిపైగా **వైద్య సేవలు**
- కూటమి ప్రభుత్వం వచ్చాక సాయంత్రం ఓపీ నిలిపివేత
- టెస్టుల అనంతరం మరో రోజు రావాల్సి వస్తోందని రోగుల ఆందోళన



ఓపీ వద్ద క్యూ

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కింగ్‌జార్జి ఆస్పత్రిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. శిథిల భవనాలు, పరికరాల కొరత, ఇతర సమస్యలు ఓవైపు పీడిస్తుండగా... మరో వైపు వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం... రోగులకు సమయానికి అందని వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలకు ఎదురుచూపులు... ఇలా అనేక అవస్థల మధ్య ఆస్పత్రి నడుస్తోంది. దీనికితోడు రోగులకు ఎంతో ఉపయుక్తంగా ఉండే సాయంత్రం ఓపీకి మంగళం పాడేశారు. పేదలకు నిరంతరం ఓపీ సేవలు అందుబాటులో ఉండాలని గత ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన సాయంత్రం ఓపీని మూసివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని ఎత్తివేశారు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో ఆస్పత్రిలో ఉదయం డాక్టర్‌కు చూపించుకొని.. అనంతరం పరీక్షలు చేసుకొని సాయంత్రం ఓపీలో చూపించుకొని మందులు తీసుకొని రోగులు ఇంటికి వెళ్లే వారు. సాయంత్రం ఓపీ లేకపోవడంతో ఇంకో రోజు ఆస్పత్రికి రావలసి వస్తోందని రోగులు ఆవేదన చెందుతున్నారు.



మందులు ఇచ్చే గది వద్ద రద్దీ

రోగులకు ఉపయోగకరంగా..

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి కేజీహెచ్‌కు ప్రతి రోజూ వందలాది మంది రోగులు వస్తుంటారు. వీరు ఉదయం ఓపీ తీసుకొని వైద్యులకు చూపించే సరికి ఒక పూట గడిచిపోతుంది. వైద్యుల సూచన మేరకు వివిధ పరీక్షలు చేయించే సరికి మధ్యాహ్నం అవుతుంది. ఆ రిపోర్టులు వచ్చేసరికి వైద్యులు అందుబాటులో ఉండడం లేదు. మళ్లీ అదే యూనిట్ ఓపీ వచ్చేసరికి వారం రోజులు పడుతుంది. ఇంతలో రోగం ముదిరిపోయే పరిస్థితి ఉండేది. పేద రోగుల అవస్థలను గుర్తించిన గత ప్రభుత్వం సాయంత్రం ఓపీని అందుబాటులోకి తెచ్చింది. ఇది రోగులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది.

3-4 గంటల మధ్య 200కి పైగా ఓపీలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. అందులో భాగంగా బోధన ఆస్పత్రుల్లో ఈవినింగ్ ఓపీని 2023 మే 17వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చింది. కేజీహెచ్‌లో తొలి విడతగా గైనిక్, డెర్మటాలజీ, సర్జన్స్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్ విభాగాల్లో సాయంత్రం ఓపీలు ప్రారంభించి అమలు చేసింది. ఆ తర్వాత అన్ని విభాగాల్లో కూడా సాయంత్రం ఓపీలు నడిచేవి. మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకు ఈ ఓపీ నిర్వహణ ఉండేది. ఉదయం ఏ యూనిట్ ఓపీ నిర్వహిస్తే, సాయంత్రం కూడా అదే యూనిట్ వైద్యులు ఓపీ నిర్వహించాల్సి ఉండేది. ప్రతి రోజు ఉదయం ఓపీల్లో వైద్యులు రాసిన వివిధ పరీక్షలు చేయించుకొని ఆ రిపోర్ట్సును సాయంత్రం ఓపీ సమయంలో వైద్యులు పరిశీలించి మందులు రాయడానికి వీలు ఉండేది. ప్రతి రోజూ సుమారు 200 మంది వరకు రోగులు సాయంత్రం ఓపీ కోసం వచ్చేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాయంత్రం ఓపీ సేవలకు మంగళం పాడేసింది. దీంతో రోగులకు కష్టాలు తప్పడం లేదు.

జ్వరాల విజృంభణ

నగరంలో వైరల్ ఫీవర్లు విజృంభిస్తున్నాయి. దోమల బెడద వల్ల డెంగ్యూతోపాటు మలేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి. దీంతో కేజీహెచ్‌తోపాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగుల తాకిడి అధికంగా ఉంది. కొందరు వైద్యులను సంప్రదించి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు. కేజీహెచ్ భావనగర్ వార్డులో జ్వరబాధితుల కోసం ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశారు. ఏఎంసీ వార్డులో 12 పడకలు జ్వర బాధితుల కోసం అందుబాటులో ఉంచారు. ఓపీలో అధికంగా జ్వరంతో బాధపడేవారు ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో సాయంత్రం ఓపీ ఉంటే జ్వరబాధితులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది.



వార్డులో చికిత్స పొందుతున్న జ్వరబాధితులు

ఈవినింగ్ ఓపీ నడవడంలేదు



ప్రస్తుతానికి సాయంత్రం ఓపీలు నడవడం లేదు. ఈ సాయంత్రం ఓపీల గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. అందువల్ల ఉదయం ఓపీలను నిర్వహిస్తున్నాం. ఓపీలకు గతంలో కంటే ఇప్పుడు రోగుల సంఖ్య పెరిగింది. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నాం.

–డాక్టర్ శివానంద్, సూపరింటెండెంట్, కేజీహెచ్

చేసేది లేక వెనుదిరిగాను..



ఒంట్లో బాగోలేదని కేజీహెచ్‌కు వచ్చాను. ఉదయం వైద్యులకు చూపించాను, కొన్ని పరీక్షలు రాశారు. పరీక్షలు పూర్తి చేసుకొని సాయంత్రం ఓపీకి వెళ్లాను. అక్కడ తలుపులు మూసి ఉన్నాయి. ఓపెన్ చేస్తారని చాలా సేపు అక్కడే కూర్చున్నాను. ఎంతకీ తలుపులు తీయకపోవడంతో పక్క గదిలో ఉన్న సిబ్బందిని అడగ్గా సాయంత్రం ఓపీలు ఇప్పుడు లేవని చెప్పారు. చేసేది లేక వెనుదిరిగాను.

– సిహెచ్ సత్తిరాజు, రెల్లివీధి, జాలారిపేట

ఎందుకు మూసేశారో..



నాకు తీవ్ర జ్వరం రావడంతో ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌కు చూపించాను. డాక్టర్ పరిశీలించి టెస్టులు రాశారు. టెస్టులు చేయించుకొని రిపోర్టులతో సాయంత్రం ఓపీకి వెళ్లాను. చాలా రోజుల నుంచి సాయంత్రం ఓపీ నడవడం లేదని అక్కడ వారు చెప్పారు. సాయంత్రం ఓపీ ఎంతో ఉపయోగంగా ఉండేది. ఇప్పుడు ఎందుకు మూసేశారో అర్థం కావడం లేదు.

– జి.వి.లక్ష్మి, మంథావారి వీధి,

భగ్గుమన్న కార్మికలోకం

- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో రాస్తారోకో
- కార్మికులను అడ్డుకున్న పోలీసులు, స్టేషన్‌కు తరలింపు



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు



కూర్మన్నపాలెం జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకులు



నర్సింగరావును ఈడ్చుకెళ్తున్న పోలీసులు



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం జరిగిన రాస్తారోకోలో కార్మికులు కదం తొక్కారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ కార్మికులు కూర్మన్నపాలెం కూడలి వద్ద నిరసన తెలిపారు. కార్మికులు పెద్ద ఎత్తున జాతీయ రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోయింది. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ నడపాలని కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ట్రాఫిక్ జామ్ కావడంతో పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు కార్మికులను అక్కడ నుంచి తొలగించడానికి ప్రయత్నించారు. కార్మికులు వ్యతిరేకించడంతో పోలీసులకు, కార్మికులకు మధ్య తోపులాట జరిగింది. దీంతో పోలీసులు నాయకులను ఎత్తుకుని సమీపంలో ఉన్న వాహనాల్లోకి ఎక్కించి, పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 1307 రోజులుగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేసి పూర్తి సాయం అందించాలని డిమాండ్ చేశారు. 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, పోరాట కమిటీ నాయకులు సీహెచ్.నరసింగరావు, డి.ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, రామ్మోహన్‌కుమార్, పి.వి.రమణమూర్తి, ఎన్.రామారావు, వై.టి.దాస్, యు.రామస్వామి, పల్లా పెంటారావు, పల్లా కార్తీక్, బి.తౌడన్నలను స్టీల్‌ప్లాంట్ స్టేషన్‌కు తరలించారు. 30 మంది నాయకులను అదుపులోకి తీసుకుని సాయంత్రం వారిని వదిలి పెట్టినట్టు దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌పై మైండ్ గేమ్ ఆపాలి



స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు, కార్మికులు



ఆర్టీసీ బస్సు ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్మిక సంఘ నేతలు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ పోరాట కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కుట్ర కారణంగానే విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యం అవుతోందని, ప్రభుత్వాల మైండ్ గేమ్ తక్షణం ఆపాలని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయకపోవడంతోపాటు ఎన్ఎండీసీ నుంచి ఖనిజం ఇవ్వకపోవడం దారుణమన్నారు. అనంతరం జీవీఎంసీ గాంధీపార్కు మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్, లలితా జ్యుయలర్స్ జంక్షన్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులను పోలీసులు చెదరగొట్టారు. రాస్తారోకోలో సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఏసీహెచ్. అచ్యుతరావు, ఇంటక్ జాతీయ నాయకుడు బి.నాగభూషణం, ఇఫ్టూ రాష్ట్ర నాయకుడు ఎం.వెంకటేశ్వర్లు, అఖిలపక్ష నాయకులు పి.మణి, రహమాన్, పి.వెంకటరెడ్డి, గణేష్‌పాండా, ఎం.సుబ్బారావు, దేవా, అప్పలరాజు, శేఖర్, మౌళి, నరేంద్రకుమార్, పి.ఇందిర, అప్పారావు, పి.లక్ష్మి, వామనమూర్తి, తిరుపతిరావు, నూకరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం

- ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపదమిత్ర బృందం
- హోం శాఖ మంత్రి అనిత



మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

మహారాణిపేట: ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలని, తక్షణ రక్షణ, సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు జరిగిన నష్టాలు, సహాయక చర్యలపై ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జాయింట్ సీపీ కె.ఫకీరప్ప, జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఐదుగురు సభ్యులతో ఆపదమిత్ర బృందాలను సిద్ధం చేసి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవలసిన సహాయక చర్యలపై శిక్షణను ఇవ్వనున్నామన్నారు. ఆయా జిల్లాల్లో జలాశయాల స్థితిగతులపై కలెక్టర్ సమీక్షించాలని తెలిపారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో వర్షాల సమయంలో ఎక్కడికక్కడ సహాయక చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, పి.భాస్కరరెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, జీవీఎంసీ, పౌర సరఫరాలు, వైద్య ఆరోగ్యం, మత్స్య, వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల, ఏపీఈపీడీసీఎల్, ఆర్ అండ్‌బీ, ఆర్.డబ్ల్యూఎస్, జిల్లా అగ్ని మాపక అధికారి, ఉప రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో పాలన అస్తవ్యస్తం..!

- దళిత ఉద్యోగులకు అన్యాయం
- ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్లకు అందని పదోన్నతులు
- అకౌంట్స్ సెక్షన్‌లోను ఇదే పరిస్థితి
- అగ్రకుల జూనియర్లకే అందలం.. ఇన్‌చార్జి బాధ్యతలు వారికే..
- పోస్టులు ఖాళీగా ఉన్నా ప్రమోషన్లు ఇవ్వని పాలకులు



విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాలకుల వ్యవహార శైలి వివాదాస్పదమవుతోంది. వారు తీసుకుంటున్న నిర్ణయాలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి. గత పాలకులపై వచ్చిన రాజకీయ ప్రేరేపిత ఆరోపణలపై కమిటీల ఏర్పాటు నుంచి ప్రస్తుత ఉద్యోగుల పదోన్నతుల వ్యవహారం వరకు.. అన్నీ విశ్వవిద్యాలయం విలువను దిగజార్చేలా ఉన్నాయి. విద్యార్థులకు ఉన్నతమైన జ్ఞానాన్ని అందించాల్సిన యూనివర్సిటీలో కులజాడ్యం రాజ్యమేలుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కొన్ని విభాగాల్లో పదోన్నతుల విషయంలో పాలకులు తీసుకుంటున్న నిర్ణయాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

జూనియర్లకు ఇన్‌చార్జి బాధ్యతలా..?

ఏయూలో ఇంజనీరింగ్, అకౌంట్స్.. ఇలా పలు విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటికి అర్హులైన వారు చాలా కాలంగా పదోన్నతుల కోసం వేచిచూస్తున్నారు. ఆ పోస్టులను భర్తీ చేయకపోగా.. ప్రమోషన్ల కోసం వారు పెట్టుకున్న అర్జీలను బుట్టదాఖలు చేస్తుండడం గమనార్హం. ఇదిలా ఉంటే అన్ని అర్హతలు ఉన్న సీనియర్లను పక్కనపెట్టి జూనియర్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తుండడం అగ్గి రాజేస్తోంది. ఇంజనీరింగ్ విభాగంలో ఏడాదికి పైగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు ఖాళీగా ఉంది. కానీ దాన్ని భర్తీ చేసే విషయంపై పాలనాధికారులు దృష్టి పెట్టడం లేదు. కానీ జూనియర్ డీఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించి నెట్టుకొస్తున్నారు. దీనిపై కొంత మంది సీనియర్లు పెదవి విరుస్తున్నారు.

దళితులకు దక్కని పదోన్నతులు

పదోన్నతుల విషయంలో దళిత సిబ్బంది వివక్షకు గురవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టు భర్తీ చేయకపోవడం వెనుక కూడా ఇదే కారణమన్న చర్చ జరుగుతోంది. ఈ పోస్టుకు అర్హతలు ఉన్న, సీనియర్ అయిన ఒక దళిత డీఈ అనేక సార్లు ప్రమోషన్ కోసం అర్జీ పెట్టుకున్నాడు. కానీ ఇప్పటి వరకు దాన్ని పట్టించుకోలేదు. ఎన్నికల తరువాత వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ శశిభూషణరావుకు కూడా సదరు డీఈ పలుమార్లు విన్నవించుకున్నాడు. అయినప్పటికీ స్పందన లేదు. అయితే ఇన్‌చార్జి ఈఈగా జూనియర్ అయిన డీఈని నియమించారు. దళితుడిని కాదని అగ్రకులానికి చెందిన డీఈకి బాధ్యతలు అప్పజెప్పడం వివాదాస్పదమవుతోంది. అలాగే అకౌంట్స్ సెక్షన్‌లో కూడా ఒక కీలక పోస్టు విషయంలో అధికారులు ఇదే తరహాలో వ్యవహరిస్తున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. సీనియార్టీ ఉన్న వారికి ప్రమోషన్ ఇవ్వకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈయన కూడా కొత్త వీసీకి అర్జీ పెట్టుకున్నా పట్టించుకోకపోవడం విశేషం.

పదోన్నతుల్లో రాజకీయ జోక్యం

కూటమి ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకే ఏయూ పాలన నడుస్తుందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పాత పాలకవర్గం తొలగింపు నుంచి కొత్త వారి నియామకం వరకు అన్నింట్లోను రాజకీయ జోక్యం ఉందన్నది బహిరంగ రహస్యమే. ప్రజాప్రతినిధుల నుంచి కనుసైగ లేనిదే.. ఏయూలో నిర్ణయాలు జరగడం లేదన్న చర్చ జోరుగా జరుగుతోంది. యూనివర్సిటీల్లో అధికారుల ప్రతి అడుగులోను రాజకీయ ముద్ర ఉంటోందన్న వాదనలు ఉన్నాయి. తాజాగా కింది స్థాయి పదోన్నతుల విషయంలో కూడా వీరి పెత్తనమే సాగుతున్నట్లు తెలుస్తోంది. తమ వారికి మాత్రమే పదోన్నతులు, పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నట్లు సమాచారం. దాని ప్రకారమే ఏయూ పాలకవర్గం తూచా తప్పకుండా నడుచుకుంటున్నారన్న ఏయూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

క్లుప్తంగా

నేడు ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో బుధవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2024 నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, జోన్–1 ఉప సంచాలకులు ఆర్.వి.రమణ తెలిపారు. ఈ ఏడాది జూలైలో పరీక్షలు రాసిన ఐటీఐ అభ్యర్థులు మేళాలో పాల్గొనవచ్చని కోరారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ కంపెనీలతో పాటు 10కి పైగా ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఉదయం 9 గంటలకు నేరుగా మేళాకు బయో డేటా, ధ్రువ పత్రాలతో హాజరుకావాలన్నారు.

రేపు ఇంటర్వ్యూలు

పెందుర్తి: నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారి సాయికృష్ణ, జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఫైజర్, హెటిరో ల్యాబ్, కేఎల్ గ్రూప్ తదితర ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ ఫిట్టర్, డిప్లమా ఇన్ ఫార్మసీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99487 68778 నంబర్లో సంప్రదించాలన్నారు.

13న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 13న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ తెలిపారు. ట్రైడ్ రైట్ ఫైనాన్స్, ఇన్నోవ్‌సోర్స్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో 120 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అసిస్టెంట్ మేనేజర్, సేల్స్ మేనేజర్, సీనియర్ మేనేజర్, క్రెడిట్ కార్డ్స్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పలాస, టెక్కలి ప్రాంతాల్లో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.15 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఉంటుందన్నారు.

89 చోరీ కేసుల్లో 80 మంది అరెస్ట్

- రూ.60.62 లక్షల విలువైన సొత్తు రికవరీ
- రికవరీ మేళా ద్వారా బాధితులకు అప్పగింత
- చోరీ చేసి ఎక్కడ దాక్కున్నా వెంటాడి పట్టుకుంటాం
- నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి


యజమానులకు రికవరీ చేసిన సొత్తును అప్పగిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి


రికవరీ చేసిన ఆటోలు, బైక్‌లు

విశాఖ సిటీ: విశాఖలో చోరీకి పాల్పడి దేశంలో ఎక్కడ దాక్కున్నా వారిని వెంటాడి పట్టుకుంటామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో రికవరీ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆగస్టు నెలలో నగర పరిధిలో జరిగిన 89 చోరీ కేసుల్లో 80 మంది నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ.22,37,600 విలువైన బంగారం, ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే రూ.38.25 లక్షలు విలువైన మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఆగస్టు నెలలో 10 దోపిడీలు, పగటి పూట రెండు ఇళ్లలోను, రాత్రిళ్లు 28 ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలు, నాలుగు చైన్ స్నాచింగ్, 16 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోల దొంగతనాలతో పాటు ఇతర చోరీలు 25 వరకు జరిగినట్లు వివరించారు. ఈ 89 కేసులను ఛేదించి 80 మంది నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ.46,800 నగదు, 555.05 గ్రాముల బంగారం, 17 మోటల్ సైకిళ్లు, 4 ఆటోలు, 5 చీరలు, 450 కేజీల ఐరన్ సెంట్రింగ్ పైపులు, కాపర్ ఎలక్ట్రికల్ కేబుల్ వైర్లతో పాటు 267 మొబైల్ ఫోన్లు మొత్తంగా రూ.60,62,100 విలువైన సొత్తును రికవరీ చేసినట్లు తెలిపారు. రికవరీ మేళాలో మొబైల్స్, ఆటోలను సీపీ చేతుల మీదుగా యజమానులకు అప్పగించారు. జూలై నెలలో 72 కేసులు ఛేదించి రూ.47.63 లక్షలు రికవరీ చేయగా.. ఆగస్టు నెలలో అంతకంటే ఎక్కువగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసుల ఛేదనకు కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందించారు. త్వరలో జరిగే నేర సమీక్షా సమావేశంలో వారందరికీ రివార్డులు అందిస్తామని ప్రకటించారు. సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీ(క్రైమ్) లతామాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ సవరణకు చర్యలు


మాట్లాడుతున్న విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాఖ సిటీ: బృహత్తర ప్రణాళికను ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ముఖ్యమైన వర్గాలతో చర్చించి సవరించడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. మంగళవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సంస్థ చేపట్టిన అభివృద్ధి పనులను సంస్థ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో భవిష్యత్తు తరాలు ఇబ్బందులు పడకుండా ఉండాలంటే చక్కటి ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. దానికి వీఎంఆర్‌డీఏ కీలక భూమిక పోషించాల్సి ఉందన్నారు. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్ వద్ద ఆర్‌వోబీ, అండర్‌పాస్‌లను ఎన్‌హెచ్ఏఐ, రైల్వే వర్గాలతో సంప్రదించి సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సిరిపురం జంక్షన్ వద్ద నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌ను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. వీఎంఆర్‌డీఏ సందర్శన స్థలాల్లో పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. అదే సమయంలో వారిని ఆకర్షించే విధంగా కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, చీఫ్ ఇంజినీర్ భవానీ శంకర్, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికా అధికారి సంజయ్ రత్నకుమార్, ముఖ్యగణాంకాధికారి హరిప్రసాద్, వీకేపీసీపీఐఆర్–యూడీఏ జాయింట్ డైరెక్టర్ శిల్ప, ఎస్ఈ బలరామరాజు, డీఎఫ్ఓ శాంతి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

మహారాణిపేట: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా జిల్లాలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో మరింత పురోగతి సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గృహనిర్మాణ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, ఈపీడీసీఎల్, ఇంజినీరింగ్, సచివాలయ సంక్షేమ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు రోజువారీ స్టేజ్ అప్డేషన్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. యంత్రాంగానికి అన్ని విధాలుగా సహకరించి పనుల్లో కదలిక వచ్చేలా చర్యలు చేపట్టాలని గుత్తేదారులకు సూచించారు. సచివాలయ సంక్షేమ కార్యదర్శి లబ్ధిదారులను మొబలైజ్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన పనులు, సాధించిన ప్రగతిపై గృహ నిర్మాణ సంస్థ పీడీ అఖిల కలెక్టర్‌కు వివరించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

విశాఖ సిటీ: ఉపాధ్యాయ వృత్తి చాలా ఉన్నతమైనదని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా సమాజానికి అందించే గురుతర బాధ్యత వారిపై ఉంటుందని తూర్పు నావికాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ పేర్కొన్నారు. మంగళవారం తూర్పు నావికాదళం ప్రధాన కార్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన వైస్ అడ్మిరల్ నేవల్ చిల్డ్రన్ స్కూల్, కోరుకొండ సైనిక్ స్కూల్‌లో 10 నుంచి 12 తరగతుల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ట్రోఫీలు అందజేశారు. అలాగే నేవల్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన మల్లీదేవికి ప్రశంసా పత్రాన్ని ఇచ్చారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.89
బ్రాయిలర్ (లైవ్)	: రూ.109
స్కిన్	: రూ.188
స్కిన్‌లెస్	: రూ.198

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	530.00
విజయనగరం	534.00
శ్రీకాకుళం	534.00

సాహితీ సమరయోధుడు దాశరథి


మాట్లాడుతున్న అరసం నేత లక్ష్మీనారాయణ

విశాఖ సిటీ: వైష్ణవ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాం పాలన మీదకు ఎక్కుపెట్టిన గొప్ప కవి దాశరథి కృష్ణమాచార్యులు అని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగుశాఖ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో టీఎల్ఎన్ సభా హాల్‌లో కళాప్రపూర్ణ దాశరథి కృష్ణమాచార్య శతజయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నిజాం పాలనలో ప్రజల కడగండ్లను చూసి చలించి నిజాంపై అక్షర శస్త్రాలను సంధించారని తెలిపారు. సాహితీ పోరాటంతో పాటు సాయుధ పోరాటం కూడా చేసిన వారు ఇద్దరే కవులని.. వారిలో ఒక దాశరథి కృష్ణమాచార్యకాగా.. మరొకరు శివసాగర్ అని పేర్కొన్నారు. దాశరథి సాహిత్యంలో తెలంగాణ రైతాంగ పోరాటం, జాతీయవాదం, అభ్యుదయ కవిత్వం, భావ కవిత్వం కనిపిస్తాయన్నారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ 1920 దశకంలో పుట్టిన గొప్పకవుల్లో దాశరథి ఒకరని, ఆయన గురించి రేపటి తరం తెలుసుకోవాలని సూచించారు. భాషకు హద్దులు లేవని, జాషువా విశ్వ నరుడు ప్రస్తావన తెస్తూ కొందరు తెలంగాణ కవులు విభజన వాదం తేవడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో విశాలాంధ్ర జాతీయ దినపత్రిక సంపాదకుడు ఆర్‌వీ రామారావు, హైదరాబాద్ సిటీ కాలేజ్ ఆచార్యుడు, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, వైవీకే అధ్యయన కేంద్రం నిర్వాహకుడు జేవీ సత్యనారాయణమూర్తి, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు, తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు, ఆచార్య చందు సుబ్బారావు, మద్రాస్ యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యులు విస్తాలి శంకర్రావు, అరసం తెలంగాణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్, తెలంగాణ సాహిత్య అకాడమీ నుంచి సోమశిల తిరుపోలు, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, విశాఖ జిల్లా కార్యదర్శి సీఎస్ క్షేత్రపాల్, అరసం వైవీకే మార్కిస్టు అధ్యయన కేంద్రం సభ్యుడు ఎం.పైడిరాజు పాల్గొన్నారు.

సింహగిరి సెక్యూరిటీ గార్డుపై దాడి

ఒడిశాకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు


గాయపడ్డ సెక్యూరిటీ గార్డు లక్ష్మణరావు


సింహగిరి మెట్లమార్గంలో శివశంకర్ గౌడ్‌ని అదుపులోకి తీసుకున్న గోపాలపట్నం పోలీసులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డును ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి కర్రతో తలపై దాడి చేసిన సంఘటన మంగళవారం సింహాచలంలోని కొండ దిగువ స్వామివారి తొలిపావంచా వద్ద చోటుచేసుకుంది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొండదిగువ కొత్త తొలి పావంచా వద్ద లక్ష్మణరావు సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం ఉదయం ఒడిశా రాష్ట్రం బరంపురానికి చెందిన శివశంకర్ గౌడ్ తొలిపావంచా వద్దకు వచ్చి స్వామి సన్నిధిలో ఉన్న దీపం వద్ద సిగరెట్ వెలిగించేందుకు ఉపక్రమించాడు. దీంతో లక్ష్మణరావు అప్రమత్తమై అతన్ని పట్టుకున్నాడు. వెంటనే శివశంకర్ గౌడ్ కర్రతో లక్ష్మణరావు తలపై దాడి చేసి సింహగిరికి వెళ్లే మెట్లమార్గం గుండా పారిపోయాడు. వెంటనే లక్ష్మణరావు అతను పనిచేసే సెక్యూరిటీ సంస్థ యజమానికి సమాచారం అందించడంతో ఆ యజమాని కొండపైనే ఉన్న ఆ సంస్థ సెక్యూరిటీ గార్డులకు, దేవస్థానం ఉద్యోగులకు విషయం తెలియజేశాడు. కొండపై నుంచి దేవస్థానం ఉద్యోగులు, సెక్యూరిటీ గార్డులు మెట్లమార్గంలో కొండ దిగువకు దిగారు. మెట్లమార్గంలో మధ్యలో ఉన్న అంజనేయస్వామి ఆలయం వద్ద అతన్ని పట్టుకున్నారు. పిచ్చిపిచ్చి మాటలు, గంజాయి సేవించినట్టు నిందితుడి వ్యవహారశైలి ఉండడంతో గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోపాలపట్నం ఎస్.ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని శివశంకర్ గౌడ్‌ను పోలీసు స్టేషన్‌కి తరలించారు. శివశంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు కూడా సమాచారం అందించారు. గాయపడిన సెక్యూరిటీ గార్డుకు స్థానికంగా చికిత్స అందజేశారు.

అప్పులబాధతో ప్రిన్సిపాల్ ఆత్మహత్య


అప్పారావు (ఫైల్)

పీఎంపాలెం: తలకుమించిన అప్పులు తీర్చలేక ఓ ప్రయివేటు స్కూల్ ప్రిన్సిపాల్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధురవాడ కొమ్మాది జంక్షన్ సమీపంలోని సాయిరామ్ కాలనీలో మంగళవారం చోటు చేసుకున్న సంఘటనకు సంబంధించి పీఎం పాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయిరామ్ కాలనీలో కుటుంబంతో నివసిస్తూ స్థానికంగా ఓ ప్రయివేటు విద్యాసంస్థను అప్పారావు (53) నిర్వహిస్తున్నాడు. ప్రిన్సిపాల్‌గా కూడా వ్యవహరిస్తున్నాడు. భార్య జ్యోతి అతనితో పాటు ఉండగా కుమార్తె, కుమారుడు అమెరికాలో ఉంటున్నారు. అప్పారావు భారీగా అప్పులు చేశాడు. ఈ విషయమై భార్య జ్యోతితో తరచూ గొడవలు అయ్యేవి. ఈ క్రమంలో జ్యోతి దిశా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించి భార్యాభర్తలను సముదాయించారు. మంగళవారం 11 గంటల సమయంలో తాను నివాసముంటున్న అపార్ట్‌మెంట్ టెర్రస్‌పైకి వెళ్లి అక్కడ నుంచి కిందకు దూకాడు. తీవ్రంగా గాయపడిన అప్పారావును భార్య జ్యోతి ఆస్పత్రికి తరలించగా..అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పీఎం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వీరగణపతిగా సంపత్ వినాయగర్

సీతమ్మధార: నగరంలోని ఆశీలమెట్టలోని శ్రీ సంపత్ వినాయగర్ మంగళవారం వీర గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచే అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి పోటెత్తారు. ఉత్సవాలలో భాగంగా గణపతి హోమం, నాదస్వర కచేరి, ఉభయ దాతలచే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 2,000 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శ్రీవరాహ నరసింహ భజనమండలిచే గణపతి భక్తిగీతాలాపన జరిగింది. కోలాటం, వి.గౌరీ రామ్మోహన్ బృందంచే సంగీత కచేరి నిర్వహించారు. భక్తులకు దేవాదాయ–ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి శిరీష, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టీ.ఆర్.చోళన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● ఇసుక నల్లన ఎందువలన?


సాగరతీరం నల్లగా మారింది. సముద్రం ఆటుపోట్లకు గురవడంతో ఒడ్డుకు చేరిన ఇసుక నల్లగా దర్శనమిచ్చింది. దీంతో వినాయక నిమజ్జనానికి వచ్చిన భక్తులు, పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. ఫొటోలు, వీడియోలు తీశారు. తీరంలో ఉండే ఇసుకలోని సిలికాన్ ఐరన్ చర్య కారణంగా నల్లగా మారుతుంది. ఈ కారణంగానే మంగళవారం బీచ్ సమీపంలో ఇసుక నల్లగా దర్శనమిచ్చింది. -ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

మానవత్వం చాటుకున్న జాయింట్ సీపీ

మద్దిలపాలెం: కంచరపాలెం నుంచి కాన్వెంట్ జంక్షన్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొన్నాడు. అదేమార్గంలో వస్తున్న జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని తన వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తి భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదానికి కారణమైన ఇద్దరు యువకులను కంచరపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

కొండవాలు ప్రాంతాల్లో హోంమంత్రి పర్యటన


కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో వివరాలు తెలుసుకుంటున్న మంత్రి అనిత

గోపాలపట్నం: గోపాలపట్నం రామకృష్ణానగర్‌లో ఇటీవల కొండ చరియలు విరిగిపడిన ప్రాంతాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత సందర్శించారు. ఇక్కడి పరిస్థితిని ఎమ్మెల్యే గణబాబు వివరించారు. అనంతరం లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ ప్రాథమిక పాఠశాలలో ఉంటున్న బాధితులను పరామర్శించారు. లక్ష్మీనగర్ ఎఫ్‌బ్లాక్ కొండవాలను పరిశీలించారు. ఇక్కడి పరిస్థితి ప్రభుత్వానికి తెలియజేస్తానని భరోసా ఇచ్చారు. కొండవాలు ప్రాంతంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. రిటర్నింగ్ వాల్స్, కాలువలు ఏ విధంగా నిర్మించాలన్న అంశాలపై నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

సముద్ర ఉత్పత్తుల పరిరక్షణపై అవగాహన

మహారాణిపేట: అరుదైన మత్స్య జాతుల సంరక్షణపై సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ మత్స్యకారులకు అవగాహన కల్పించింది. ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఈ సదస్సులో ఐసీఏఆర్ –సీఎంఎఫ్ఆర్ఐ విశాఖ ప్రిన్సిపాల్ డాక్టర్ జాయ్ కె. కుదాన్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ పి. రంజన్ బెహరా, విశాఖ జూ అధికారి మంగమ్మ సముద్ర జాతుల పరిరక్షణకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. సముద్ర తాబేళ్లు, డాల్ఫిన్ల వంటి వాటి రక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రాష్ట్ర మర పడవల సంఘం అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, ఉపాధ్యక్షులు జి. పరశురాం, వాసుపల్లి రాజు, కేఎఫ్ రాజు, కార్యదర్శులు వి. ఎల్లారావు, ముస్సం బాలాజీ, కోలా ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.